ఖజానాలో కాసుల వర్షం

- వసూలైన పన్ను రూ.28 కోట్లు
- రికార్డు సృష్టించిన కార్పొరేషన్ ఆదాయం
- చిత్తూరు చరిత్రలో ఇదే అత్యధికం
- కమిషనర్ ముందస్తు ప్రణాళిక.. కలిసొచ్చిన వడ్డీమాఫీ



పన్ను వసూళ్లల్లో కమిషనర్ అరుణ, కార్పొరేషన్ అధికారులు

చిత్తూరు అర్బన్: నగరపాలక సంస్థ ఆస్తి పన్ను వసూలులో రికార్డు సృష్టించింది. ఈ ఏడాదిలో రూ.28 కోట్ల ఆస్తి పన్ను వసూలు చేసింది. సాధారణంగా మునిసిపాలిటీలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులే. ఇందులోనూ ఆస్తి పన్ను రూపంలో వసూలయ్యే మొత్తం ఆ మునిసిపాలిటీలో అభివృద్ధి పనులకు దోహదం చేస్తుంది. చిత్తూరు మునిసిపల్ చరిత్రలో తొలిసారిగా ఇక్కడున్న కార్పొరేషన్‌కు ఆస్తి పన్ను రూపంలో రూ.28 కోట్లకు పైగా వసూలై రికార్డులు సృష్టించింది. 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆస్తిపన్ను వసూళ్లకు శుక్రవారం చివరి రోజున కావడంతో చిత్తూరు ఖజానాలో కాసుల వర్షం కురిసినట్లయ్యింది.

గతేడాది రూ.16 కోట్లు...

చిత్తూరు కార్పొరేషన్‌కు ఒక ఆర్థిక సంవత్సరానికి రూ.28 కోట్లకు పైబడి ఆస్తిపన్ను వసూలు కావడం ఇదే తొలిసారి. గతేడాది మార్చి నెలాఖరుకు కార్పొరేషన్‌కు పన్నుల రూపంలో వసూలువైన మొత్తం రూ.16 కోట్లే. ఈసారి ఏకంగా రూ.12 కోట్లు అదనంగా ఖజానాకు చేరి, కాసుల కళ తెచ్చిపెట్టింది. ఇందులో మునిసిపల్ కమిషనర్ అరుణ ముందస్తు ప్రణాళిక స్పష్టంగా కనిపిస్తోందనే చెప్పాలి. గతేడాది ఏప్రిల్లో ఆమె ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకునే సమయానికి పన్నుల వసూళ్లల్లో పలమనేరు తొలిస్థానంలో నిలబడగా.. చిత్తూరు చివరి స్థానంలో ఉండేది. ఒక్క మార్చి నెలలో మాత్రం పన్నుల వసూళ్లపై దృష్టి పెట్టకుండా ఓ ప్రణాళిక ప్రకారం నగరంలో కొత్తగా నిర్మిస్తున్న భవనాలు, పన్నుల పరిధిలోకి రాని భవనాలు, పెద్ద భవనాలుగా ఉన్నా తక్కువ పన్నులు వేయడం లాంటి అంశాలపై దృష్టి పెట్టారు. ఫలితంగా 2022–23 ఆర్థిక సంవత్సరానికి రూ.5 కోట్ల వరకు కొత్తగా ఆదాయాన్ని సృష్టించారు. ఇదే సమయంలో ప్రతీ నెలా పన్నుల వసూళ్లలో అధికారులకు లక్ష్యాలు కేటాయిస్తూ వాటి వసూళ్లను పర్యవేక్షిస్తూ వచ్చారు. దీర్ఘకాలికంగా పన్నులు చెల్లించని మొండి బకాయిదారుల జాబితాను తయారు చేయించి ఫిబ్రవరి నుంచే వీళ్ల నుంచి పన్నులు వసూలు చేయాలని సంకల్పించుకున్నారు. నగరంలో దాదాపు 150 మంది నుంచి రూ.4 కోట్లకు పైగా పన్నులు వసూలు చేయడంలో అధికారులు సఫలీకృతమయ్యారు.

వడ్డీమాఫీతో దూకుడు..

ఇదే సమయంలో ఆస్తిపన్నుపై వడ్డీను మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం మార్చి 16న జీవో విడుదల చేయడం మునిసిపాలిటీలకు వరంలా మారింది. జిల్లా మొత్తంలో రూ.16 కోట్లకు పైగా వడ్డీ మాఫీ చేస్తే.. ఒక్క చిత్తూరులో మాత్రం 12.35 కోట్లు వడ్డీ మాఫీ అయ్యింది. వన్‌టైమ్ సెటిల్‌మెంట్ ద్వారా పన్ను చెల్లించేవాళ్లకు వడ్డీమాఫీ చేస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో ఏళ్ల తరబడిగా పన్ను చెల్లించకుండా ఉన్న వాళ్లు పన్నులు చెల్లించడానికి క్యూ కట్టారు. దీంతో చిత్తూరుకు భారీ ఆదాయం సమకూరినట్లయ్యింది. పన్నులు చెల్లించడానికి శుక్రవారం అర్ధరాత్రి వరకు సమయం ఉండటంతో కార్పొరేషన్‌కు అదనపు ఆదాయం రావొచ్చని అధికారులు భావిస్తున్నారు. ఏది ఏమైనా చిత్తూరు కార్పొరేషన్ ఖజానా చాలా సంవత్సరాల తరువాత నిండుగా ఉండటం పాలకులు, అధికారులకు నూతనోత్సాహాన్ని ఇస్తోంది. నగర అభివృద్ధికి పాలకుల సూచనలను పాటిస్తూ నిధులు ఖర్చు పెట్టడానికి వెనుకాడేదిలేదని కమిషనర్ అరుణ తెలిపారు.

క్లుప్తంగా

ఆటోస్టాండ్ ప్రారంభం



ఆటోస్టాండ్ ప్రారంభిస్తున్న ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి

గుడిపాల: మండలంలోని బొమ్మసముద్రంలో శుక్రవారం ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి చేతుల మీదుగా బీఆర్ అంబేడ్కర్ ఆటోస్టాండ్‌ను ప్రారంభించారు. ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ బొమ్మసముద్రం ప్రాంతం నుంచి సుమారుగా 70 గ్రామాల ప్రజలకు ఈ ఆటోల వల్ల సౌకర్యంగా ఉంటుందని చెప్పారు. ఆయనతో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులు వెంకటేష్‌రెడ్డి, రజిని, ప్రసాద్‌గౌడ్, సాయిప్రతాప్ పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయం ప్రారంభం

చిత్తూరు కార్పొరేషన్: చిత్తూరులో జిల్లా బీజేపీ కార్యాలయాన్ని శుక్రవారం ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ఢిల్లీ నుంచి వర్చువల్ విధానంలో ప్రారంభించారు. స్థానికంగా ఈ కార్యక్రమానికి రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు హాజరయ్యారు. రానున్న ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని నాయకులకు సూచించారు. పార్టీ బలోపేతానికి ఐక్యంగా అందరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కోలాఆనంద్, రామభద్ర పాల్గొన్నారు.

నేడు గడపగడపకు మన ప్రభుత్వం

చిత్తూరు కార్పొరేషన్: నగరంలోని తేనెబండలో శనివారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నారు. వీరబ్రహ్మస్వామి ఆలయం నుంచి గడపగడపకు వెళ్లి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ప్రజాసమస్యలు తెలుసుకుంటారని ఎమ్మెల్యే కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

నేడు ఉపాధిహామీ ప్రజావేదిక సభ

బంగారుపాళెం: స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో శనివారం ఉపాధి హామీ పథకం ప్రజావేదిక సభను నిర్వహించనున్నట్లు ఏపీఓ కిరణ్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు ఉన్నతాధికారుల సమక్షంలో సభ ప్రారంభం అవుతుందన్నారు. 2021–22 సంవత్సరంలో మండలంలో ఎన్ఆర్ఈజీఎస్ పథకం కింద చేపట్టిన పనులపై బహిరంగ విచారణ నిర్వహించనున్నట్లు తెలిపారు.

పూతలపట్టు సంత వేలం

పూతలపట్టు: మండల కేంద్రంలో సంతగేటు దగ్గరున్న వారపు సంతను శుక్రవారం ప్రముఖ పారిశ్రామిక వేత్త జగదీశ్వర్ రెడ్డి అధ్యక్షతన పూతలపట్టు సచివాలయంలో వేలం పాట నిర్వహించారు. ఈ వేలం పాటలో అమ్మేపల్లికి చెందిన రాజేంద్రరెడ్డి రూ.13,30,300కు సొంతం చేసుకున్నట్లు పంచాయతీ సెక్రటరీ ఖాన్ తెలిపారు. దుకాణాలు, కాంప్లెక్సులను ఆయా యజమానులు రూ.6,86,400 కు సొంతం చేసుకున్నట్లు తెలిపారు. ఈ వేలంపాటలో సర్పంచ్ మాసిలామణి, వీఆర్వో మధుబాబు, రాజేంద్రన్, ఖాదర్ వలీ, ఎంపీటీసీ షణ్ముగం పాల్గొన్నారు.

వినాయకుని సేవలో వెంకయ్య కుమార్తె

కాణిపాకం(యాదమరి): కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని మాజీ భారత ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు కుమార్తె దీపవెంకట్ దర్శించుకున్నారు. శుక్రవారం సాయంత్రం ఆమె కు టుంబ సమేతంగా స్వామివారి దర్శనార్థం విచ్చేయగా ఆలయ ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ఆలయ మాజీ చైర్మన్ మణినాయుడు, ఆలయ సూపరింటెండెంట్ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభం



గుడిపాల:మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న నాయకులు

గుడిపాల: మండలంలోని నరహరిపేట జెడ్పీ హైస్కూల్లో శుక్రవారం మినరల్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, స్థానిక సర్పంచ్ రజినీకాంత్ వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. వారు మాట్లాడుతూ నాబార్డ్ నిధుల నుంచి రూ.5.11లక్షలతో విద్యార్థుల సౌకర్యార్థం వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాఠశాలకు నాబార్డ్ ద్వారా రూ.71లక్షలతో పాఠశాల భవనాలు, మరమ్మతులతో పాటు వాటర్‌ప్లాంట్‌ను అందించినట్లు వివరించారు.

ఎస్సీ, ఎస్టీల నిరసన

చిత్తూరు కలెక్టరేట్ : ఎస్సీ, ఎస్టీల డిమాండ్లను పరిష్కరించాలని ఆ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు వినాయకం అన్నారు. నగరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆ సంఘ నాయకులు కళ్లకు గంతలు కట్టుకుని నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు జ్యుడీషియల్ పవర్ ఇవ్వాలని, ఎయిడెడ్ జూనియర్ కళాశాలల్లో బ్యాక్‌లాగ్ పోస్టులు భర్తీ చేయాలని, అంబేడ్కర్ జీవిత చరిత్రను ప్రతి తరగతి గదిలో పాఠ్యాంశంగా పెట్టాలన్నారు.

ఆరుగురు వన్యప్రాణి వేటగాళ్ల అరెస్ట్



నిందితులను అరెస్ట్ చూపుతున్న సీఐ, ఎస్ఐ

ఐరాల: ఆరుగురు వన్యప్రాణుల వేటగాళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. సీఐ ఆశీర్వాదం, ఎస్ఐ వెంకటేశ్వర్లు కథనం మేరకు, గురువారం బెస్తపల్లెకు చెందిన జి.సుబ్రమణ్యం (51) వన్యప్రాణుల వేటకు వెళ్లి విద్యుత్ తీగల కారణంగా మృత్యువాతపడిన విషయం తెలిసిందే. దీంతో మృతునితోపాటు వేటకు వెళ్లిన ఆరుగురు వేటగాళ్లను పక్కా సమాచారం మేరకు సీఐ, ఎస్ఐ బృందం వైఎస్ గేటు బస్టాప్ వద్ద జి. శ్రీనివాసులు (బెస్తపల్లె), నందయ్య (బెస్తపల్లె), ఏ.రెడ్డెప్ప(వడ్డిపల్లె), పి.సుబ్రమణ్యం (వడ్డిపల్లె), ఎం.చిన్నబ్బ (వడ్డిపల్లె), బి. వీరభద్ర (వడ్డిపల్లె)ను అరెస్టు చేశారు. వారిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు.

వైభవంగా సాగుతున్న నవమి ఉత్సవాలు







చిత్తూరు: ఏనుగుపై నీలకంఠుడి చిద్విలాసం, యాదమరి: శేషవాహనంపై దేవదేవేరులు, తవణంపల్లె: పుష్పక విమానంపై ఊరేగుతున్న సీతారామలక్ష్మణులు

చిత్తూరు రూరల్: చిత్తూరు నగరంలోని శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో శుక్రవారం వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహించారు. వేదపండితులు స్వామిని సుప్రభాత సేవలో మేల్కొలిపి అభిషేక పూజలు జరిపించారు. ఉదయం హంస ప్రభ వాహనం, రాత్రి సూర్య ప్రభ వాహనంపై ఊరేగించారు. స్వామివారికి భక్తులు అడుగడుగునా కర్పూర హారతులు పట్టి, మొక్కులు చెల్లించుకున్నారు. చైర్మన్ సకల వెంకటేష్‌గుప్తా, సభ్యులు రాజా, హేమాద్రి, మాధవి, దుర్గాదేవి, ఈశ్వరి పాల్గొన్నారు.

ఏనుగుపై నీలకంఠుడి చిద్విలాసం

పంగుణి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని నగరంలోని శ్రీ అగస్తీశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం కేడయఏనుగు వాహనంపై స్వామివారు చిద్విలాసం చేశారు. బ్రహోత్సవాల్లో భాగంగా స్వామివారికి అభిషేక పూజలు చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయం కేడ య ఉత్సవంలో స్వామి వారు భక్తులను కనువిందు చేశారు. రాత్రి ఏనుగు వాహనంపై విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. భక్తులు భక్తి ప్రపత్తులతో స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

శేషవాహనంపై సీతారామచంద్రులు

యాదమరి: మండల కేంద్రంలో సీతారామచంద్రులు శేషవాహనంపై పుర వీధుల్లోవిహరించారు. శ్రీరామనవమి పురస్కరించుకొని స్వామివారి కల్యాణం అనంతరం దేవదేవేరులు శేష వాహనంలో కొలువుదీరి ఊరేగారు. స్వామివారికి భక్తులు కర్పూర మంగళ హారతులు ఇచ్చి మొక్కులు తీర్చుకున్నారు.

పుష్పక విమానంలో సీతారామలక్ష్మణులు

తవణంపల్లె: కోదండరామ స్వామి దేవస్థానం శ్రీరామ నవమి బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం రాత్రి పుష్పక విమానంలో సీతారామలక్ష్మణులు ఊరేగుతూ భక్తులను కనువిందు చేశారు. భక్తులు స్వామికి కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకొన్నారు. శనివారం ఉదయం సీతారామలక్ష్మణులు, ఆంజనేయస్వామికి అభిషేకం, రాత్రి పుష్పపల్లకి సేవ నిర్వహించనున్నట్లు ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులు తెలిపారు.

ఫ్యామిలీ ఫిజీషియన్‌కు విశేష స్పందన



ఐరాల: చిన్నారులతో ముచ్చటిస్తున్న డాక్టర్ ప్రవీణ్‌కుమార్

ఐరాల: మండలంలోని కోనగుంట దళితవాడలో నిర్వహించిన ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. శుక్రవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా కోనగుంట దళితవాడలో స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ప్రవీణ్‌కుమార్ ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించారు. 104 వైద్య శిబిరంలో 70 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలోని పిల్లలకు వైద్య పరీక్షలు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ శంకరమ్మ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యం కోసమే

తవణంపల్లె: ప్రజల ఆరోగ్యం కోసమే ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు వైద్యాధికారి డాక్టర్ వినయ్‌కుమార్ అన్నారు. ఆయన శుక్రవారం మండలంలోని తెల్లగుండ్లపల్లెలో ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమం నిర్వహించారు. 104 శిబిరంలో 65 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్లు సుబ్రమణ్యం రెడ్డి, శ్రీనివాసులు, ఏఎన్ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

అవగాహన అవసరం

ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన ఉండాలని ఆరోగ్య విద్యాధికారి రాజేంద్రకుమార్ తెలిపారు. శుక్రవారం మండలంలోని కొత్తగొల్లపల్లె పాఠశాలలో, సంతపల్లెలో ఫ్రైడే డ్రైడే పాటించాలని, ఆరోగ్య సూత్రాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఇళ్ల దగ్గర నీరు నిల్వ ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వైద్య సిబ్బంది,ఆశావర్కర్లు,సంఘమిత్రలు, విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

శుభ్రత అవసరం

చిత్తూరు రూరల్: అపరిశుభ్ర వాతావరణం కారణంగా పలు రకాల వ్యాధులు వ్యాపిస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి జి ప్రకాశం అన్నారు. చిత్తూరు నగరం 44వ వార్డులో శుక్రవారం ఆయన పర్యటించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా పరిసరాల శుభ్రత, దోమల వ్యాప్తి నివారణ చర్యలు చేపట్టారు. దోమల వృద్ధి వల్ల కలిగే అనర్థాలను వివరించారు. కార్యక్రమంలో డీఐఓ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు



కాశిరాళ్లలో ప్యాడ్స్ అందిస్తున్న ఉపాధ్యాయులు



పూతలపట్టు: మాట్లాడుతున్న గౌహతి సుబ్బారెడ్డి



తవణంపల్లె : క్యాండిల్ వెలిగించిన విద్యార్థులు

పూతలపట్టు: పూతలపట్టు మండలం జెడ్పీ హైస్కూల్‌లో శుక్రవారం పదవ తరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా భీమేశ్వర కళాశాల ప్రిన్సిపల్ గౌహతి సుబ్బారెడ్డి పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాగా చదివి, పరీక్షల్లో ఉత్తీర్ణత పొందాలని ప్రతి విద్యార్థికి తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష పాడ్స్ అందజేశారు. దాత రామ్మూర్తిరెడ్డి ఉత్తమ విద్యార్థులకు నగదు బహుమతిని అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ దేవిక, ఎంపీపీ కుమారి పాల్గొన్నారు.

పాఠశాల వార్షికోత్సవం

యాదమరి: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాల 62వ వార్షికోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం పాఠశాల ఆవరణలో సరస్వతీ విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. హెచ్ఎం గిరిరాజ, తల్లి దండ్రుల కమిటీ అధ్యక్షులు రాజారెడ్డి, స్థలదాత పెరుమాళ్లపల్లెకు చెందిన చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రైటింగ్ ప్యాడ్స్ వితరణ

మండలంలోని కాశిరాళ్ల గొల్లపల్లె ఉన్నత పాఠశాలలోని పదో తరగతి విద్యార్థులకు పీఆర్‌టీయూ రాష్ట్ర వైస్ ప్రెసిడెంట్ కనకాచ్చారి, జిల్లా కార్యదర్శి హిమబిందు సొంత నిధులు వెచ్చించి రైటింగ్ ప్యాడ్స్‌ను పాఠశాల హెచ్ఎం రమేష్ చేతుల మీదుగా అందించారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

తవణంపల్లె: పదవ తరగతిలో వందశాతం ఉత్తీర్ణత సాధించాలన్నదే లక్ష్యంగా విద్యార్థులు చదవాలని తవణంపల్లె హైస్కూల్ హెచ్ఎం శ్రీరంజని అన్నారు. శుక్రవారం హైస్కూల్లో పదవ తగరతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఓం చుట్టూ కొవ్వొత్తులు వెలిగించి, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

సందడిగా ఫేర్‌వెల్ డే

గుడిపాల: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు శుక్రవారం ఆత్మీయ వీడ్కోలు కార్యక్రమం సందడిగా నిర్వహించారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హెచ్ఎం సబర్మతి, జెడ్పీవైస్ చైర్మన్ రమ్య, ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి, తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్, సర్పంచ్ రజనీకాంత్ 102మంది విద్యార్థులకు బుక్‌లెట్ ఫైల్స్‌ను అందజేశారు.

‘గడపగడప’ సమస్యలను పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు

చిత్తూరు రూరల్: గడపగడపలో వచ్చిన సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఆదేశించారు. చిత్తూరు నగరం లక్ష్మీనగర్‌కాలనీలోని తన నివాసంలో శుక్రవారం ఆయన మండల అధికారులతో గడపగడపలో వచ్చిన అర్జీలపై సమావేశం నిర్వహించి మాట్లాడారు. 17 పంచాయతీల్లో ఇంటిస్థలాలు, గృహ నిర్మాణ మంజూరు, కరెంటు తదితర సమస్యలపై గడపగడపలో అర్జీలు వచ్చాయన్నారు. వాటిని పూర్తి స్థాయిలో పరిశీలించి అధికారులు పూర్తి చేయాలన్నారు. అర్జీదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ కిరణ్, డీటీ ధనంజయ్య, నాయకులు త్యాగరాజులు, అమరనాథ్‌రెడ్డి, బాబు, భాస్కర్, రాజేంద్ర, దిలీప్, అధికారులు పాల్గొన్నారు.

నేడు ఉపాధి ప్రజా వేదిక

తవణంపల్లె: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి పనులపై నిర్వహించిన సామాజిక తనిఖీపై శనివారం మధ్యాహ్నం ప్రజావేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ హరిప్రసాద్ రెడ్డి, ఏపీఓ లలిత తెలిపారు. 2021 ఏప్రిల్ నెల నుంచి 2022 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి పనులపై ఈ నెల 9వ తేదీ నుంచి 20వ తేదీ వరకు గ్రామాల్లో సామాజిక తనిఖీ చేపట్టారు. దీనిపై ప్రజావేదిక నిర్వహిస్తామని వివరించారు.

ఏప్రిల్ 14 నుంచి నిరసన

చిత్తూరు కార్పొరేషన్: కేంద్రంలో బీజేపీ అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఏప్రిల్ 14 నుంచి 30 వరకు సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు నాగరాజన్, గంగరాజు తెలిపారు. చిత్తూరులో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. త్వరలో దీనిపై కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



గుడిపాల: పౌష్టికాహారంతోనే ప్రతి ఒక్కరికీ సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ అనురాధ అన్నారు. మండలంలోని వెంగమాంబపురం గ్రామంలో పోషణ్ పక్వాడా సంబరాలు శుక్రవారం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సరఫరా చేస్తున్న పోషకాహార ప్రదర్శన చేపట్టారు. చిరుధాన్యాలతో చేసే ఆహార పదార్థాలు, ఆకుకూరలు, కూరగాయలు ఎక్కువగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు అముద, చిట్టెమ్మ, సుజాత, చంద్రమ్మ పాల్గొన్నారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

యాదమరి: గ్రామీణ ప్రజలు పౌర హక్కులపై అవగాహన పెంపొందించుకోవాలని ఎంపీడీఓ శివరాజ్, తహసీల్దార్ చిట్టిబాబు తెలిపారు. మండలంలోని బోధగుట్టపల్లె పంచాయతీలోని పెరగాండ్లపల్లె దళితవాడలో శుక్రవారం వారు ప్రజలకు పౌరహక్కులపై అవగాహన సమావేశం నిర్వహించారు. అధికారులు మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఎలాంటి సమస్యలు వచ్చినా దళారుల ను ఆశ్రయించకుండా నేరుగా అధికారుల వద్దకు రావాలని చెప్పారు. ఎవరైనా బెదిరింపులకు పా ల్పడితే వెంటనే పోలీసుల స్టేషన్‌లో ఫిర్యాదు చే యాలని ఎస్ఐ సుమన్ వివరించారు. కార్యక్రమంలో దళిత నాయకులు మురుగేష్ పాల్గొన్నారు.

వరసిద్ధుని సేవలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు



సోము వీర్రాజుకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఈఓ వెంకటేశు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామిని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు సోము వీర్రాజు శుక్రవారం దర్శించుకున్నారు. ఉదయం ఆయన విచ్చేయగా ఆలయ ఈఓ వెంకటేశు స్వాగతం పలికి స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం ఆశీర్వాద మండపంలో వేదపండితులచే ఆశీర్వచనం అందించి స్వామివారి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందించారు. ఏఈఓ విద్యాసాగర్ రెడ్డి, చిత్తూరు వెస్ట్ సీఐ శ్రీనివాస రెడ్డి, కాణిపాకం ఎస్ఐ మనోహర్ సూపరింటెండెంట్ కోదండపాణి, ఇన్‌స్పెక్టర్ బాలాజీ నాయుడు, బీజేపీ నాయకులు కోలా ఆనంద్ పాల్గొన్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోండి

ఐరాల: కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకుని సామాజికంగా, ఆర్థికంగా ఎదగాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సోమువీర్రాజు పిలుపునిచ్చారు. ఆయన శుక్రవారం మండలంలోని మట్టపల్లె దళితవాడలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు పెరుమాళ్ సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకాల లబ్ధిదారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పీఎం కిసాన్ సమ్మాన్ నిధి ద్వారా రైతులకు ప్రతి ఏటా రూ.6000 లబ్ధి చేకూరుతోందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్, స్వచ్ఛ భారత్ మిషన్, ఉపాధి హామీ పథకం, ప్రధానమంత్రి ముద్రా యోజన తదితర పథకాల ద్వారా కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులకు వివరించారు.

మహిళా సాధికారతకు పెద్దపీట

- మహిళల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం
- ఎమ్మెల్యేలు శ్రీనివాసులు, ఎంఎస్‌బాబు
- వైఎస్సార్ ఆసరా చెక్కులు పంపిణీ



బంగారుపాళెం: ఆసరా చెక్కును మహిళలకు అందిస్తున్న ఎమ్మెల్యే ఎంఎస్ బాబు

చిత్తూరు అర్బన్: రాష్ట్రంలో మహిళా సాధికారతకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని చిత్తూరు, పూతలపట్టు ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, ఎంఎస్ బాబు అన్నారు. డ్వాక్రా మహిళలకు వైఎస్సార్ ఆసరా మూడో విడత నిధుల పంపిణీ కార్యక్రమం శుక్రవారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో వైభవంగా నిర్వహించారు. అందులో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మాట్లాడుతూ, మహిళా సంక్షేమం కోసం సీఎం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజా సంక్షేమ పథకాలను మహిళల పేరుతో అమలు చేస్తున్నారని గుర్తు చేశారు. నాడు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు డ్వాక్రా సంఘాలు తీసుకున్న రుణాలు మాఫీ చేయడంలో భాగంగా మూడో విడత నిధులను విడుదల చేసినట్లు చెప్పారు. నగర మేయర్ అముద మాట్లాడుతూ, రాష్ట్రంలో మహిళా పక్షపాత ప్రభుత్వం నడుస్తోందని, జగనన్న మహిళల కోసం ఎనలేని కృషి చేస్తున్నట్లు వివరించారు. నగర కమిషనర్ అరుణ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆర్థికంగా పురోభివృద్ధి సాధించాలని పిలుపునిచ్చారు. నగరపాలక సంస్థ పరిధిలో మహిళల పురోగతికి అనేక కార్యక్రమాల అమలు చేస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో భాగంగా నగరంలోని 1– 25 వార్డుల పరిధిలో 18,890 డ్వాక్రా మహిళలకు సంబంధించి రూ.18.82 కోట్ల మెగా చెక్కును ఎమ్మెల్యే, మేయర్, కమిషనర్ తదితరులు డ్వాక్రా మహిళలకు అందించారు. కార్యక్రమంలో భాగంగా బాలికల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రాజేష్ కుమార్ రెడ్డి, చుడా చైర్మన్ పురుషోత్తం రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ రాహుల్ రాజా రెడ్డి, కార్పొరేటర్లు పాల్గొన్నారు.

అక్కా చెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే లక్ష్యం

పూతలపట్టు/బంగారుపాళెం: అక్కాచెల్లెమ్మల ఆర్థికాభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ఎంఎస్ బాబు అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో శుక్రవారం మూడవ విడత వైఎస్సార్ ఆసరా కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. 919 గ్రూపులు 84,062 మంది లబ్ధిదారులకు గాను రూ.8.94 కోట్ల ఆసరా చెక్కును మహిళ సంఘాలకు అందజేశారు. ఎస్సీ, ఎస్టీ మహిళల ఉన్నతి రుణాలను 13 సంఘాలకు రూ.67 లక్షల చెక్కును అందజేశారు. అనంతరం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఎంపీడీఓ కార్యాలయ, అంగన్‌వాడీ కార్యాలయ సిబ్బంది చేసిన పూల అలంకరణ, మిల్లెట్‌ఫుడ్స్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో సీనియర్ నాయకులు తలపులపల్లిబాబురెడ్డి, రాజారత్నంరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

బంగారుపాళెంలో..

స్థానిక ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మండలంలోని 1503 స్వయం సహాయక సంఘాల్లోని 14,565 మంది సభ్యులకు రూ.68,61,30,000 చెక్కును సభ్యులకు అందజేశారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ రామచంద్రారెడ్డి, ఎంపీపీ అమరావతి, వైస్ ఎంపీపీ శిరీష్‌రెడ్డి, సింగిల్ విండో, మార్కెట్ కమిటీ చైర్మన్లు పాల్గొన్నారు.